www.prajasakti.com

ప్రజాశక్తి

గురువారం 23 ఫిబ్రవరి 2023

5

ఏలూరు

24న విద్యుత్ వినియోగదారుల అవగాహనా సదస్సు

ప్రజాశక్తి - ఏలూరు

ఆంధ్రప్రదేశ్ తూర్పుప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ ఏలూరు ఆపరేషన్ డివిజన్ పరిధిలోని విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి ఈ నెల 24వ తేదీ శుక్రవారం ఉదయం 10.30 గంటల నుండి మధ్యాహ్నం 1.30 గంటల వరకు స్థానిక ఆర్ఆర్‌పేటలోని విద్యుత్ భవన్‌లో అవగాహనా సదస్సు నిర్వహిస్తామని సిజిఆర్ఎఫ్ ఛైర్మన్, రిటైర్డ్ న్యాయమూర్తి బి.సత్యనారాయణ, ఏలూరు ఇఇ టి.శశిధర్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలు, హెచ్చుతగ్గులు, బిల్లుల్లో సమస్యలు, కొత్త సర్వీసుల జారీలో జాప్యం, బిల్లులో పేరు మార్పిడి, సరఫరా పునరుద్ధరణలో ఇబ్బందులు, నియంత్రికల మార్పిడి తదితర ఫిర్యాదులు అందించొచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిజిఆర్ఎఫ్ ఛైర్మన్‌తోపాటు సభ్యులు హరిబాబు, పి.శ్రీనివాస్, బాలాజీప్రసాద్ పాండే తదితరులు పాల్గొంటారని తెలిపారు.

దొరికితేనే దొంగ..!

దొరల్లా తిరుగుతున్న మట్టి బ్రోకర్లు - మట్టి అక్రమణ రవాణాను అడ్డుకోని అధికార యంత్రాంగం

ప్రజాశక్తి - మండవల్లి

'మట్టిని తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసి రూ.ఐదు వేలు జరిమానా విధించిన ఘటన ఇటీవల చావలపాడు వద్ద చోటుచేసుకుంది. మట్టి తరలిస్తున్న ట్రాక్టర్లను, పొక్లెయిన్లను సీజ్ చేసి రూ.రెండు లక్షలు జరిమానా విధించిన ఘటన మండవల్లిలోనూ చోటు చేసుకుంది. ఇలా అనుమతులు లేకుండా మట్టిని తరలించడం నేరమంటూ అధికారులు జరిమానా విధించిన ఘటనలు గతంలోనూ ఎన్నో ఉన్నాయి. పేదవాడు చిన్న గూడు నిర్మించుకోవడానికి ట్రాక్టర్లపై మట్టిని తరలిస్తే సంఘవిద్రోహక చర్యలకు పాల్పడినట్లు జరిమానా విధించిన అధికారులు తాజాగా మట్టి మాఫియా రెచ్చిపోయి పెద్దఎత్తున మట్టిని తరలించేస్తున్నా అధికారులు కన్నెత్తి చూడకపోవడం గమనార్హం.

పామర్రు-ఆకివీడు రహదారి సుమారు 65 కిలోమీటర్ల మేర అభివృద్ధి చేసేలా రూ.270 కోట్లకు టెండర్ ఖరారైంది. రహదారి అభివృద్ధితోపాటు కల్వర్టులు, వంతెనలు, డ్రెయినేజీలను అభివృద్ధి చేయాలి. రహదారి అభివృద్ధికి అవసరమైన మట్టిని తరలించేలా విధంగా కాంట్రాక్టర్ మట్టి మాఫియాతో డీల్ కుదుర్చుకున్నాడు. మట్టి తరలింపును, టిప్పర్లను అడ్డుకోకుండా ఉండేలా మట్టి మాఫియాదారుడు అధికారులతో లక్షల్లో ఒప్పందం కుదుర్చుకున్నట్లు సమాచారం. తద్వారా మాఫియాదారుడు మైనింగ్ అనుమతులు లేకుండా లింగాల, కొర్లపాడు గ్రామాల నుండి మట్టిని యథేచ్ఛగా తరలించేస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండికొట్టి రూ.కోట్లలో సొమ్ము చేసుకుంటున్నాడనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మట్టి మాఫియాకు అన్నివిధాలా సహకరిస్తున్న అధికారులు ఇదేమిటని ప్రశ్నించిన వారికి రోడ్డు పనులకేగా అనడం తప్ప పేదల ఇళ్ల స్థలాల మెరకపై ఎందుకు దృష్టి సారించారో ఎవరికీ అర్థంకాని ప్రశ్నగా మారింది. ఇళ్ల స్థలాలు మెరక చేసేందుకు మట్టి దొరకడం లేదని ఏళ్ల తరబడి కాలయాపన చేస్తున్న అధికారులు రోడ్డు పనులకు మట్టి ఎక్కడ నుంచి వచ్చిందంటే నోరుమెదపని పరిస్థితి నెలకొంది. మరి పేదలు మట్టి తీసుకెళ్తుంటే అనుమతుల పేరిట వేధించడం ఏమిటో అధికారులకే తెలియాలి. మట్టిమాఫియాకు సుమారు రూ.వంద కోట్లు మేర లాభం చేకూరేలా అధికారులు మౌనం వహిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మట్టి మాఫియాను నిలువరించి అవినీతిని అరికట్టాలని, పేదల ఇళ్లస్థలాలను తక్షణమే మెరక చేసి సొంతిల్లు నిర్మించుకునేలా పేదలను ప్రోత్సహించాలని కోరుతున్నారు. దీనిపై తహశీల్దార్‌ను వివరణ కోరేందుకు యత్నించగా ఆయన అందుబాటులోకి రాలేదు.

యథేచ్ఛగా మట్టి తవ్వకం, తరలింపు



పూడికకు నోచని పేదల ఇళ్ల స్థలాలు



నామినేషన్ పత్రాలను సమర్పిస్తున్న కవురు శ్రీనివాస్

నాలుగు నామినేషన్లు దాఖలు

వైసిపి తరపున కవురు, వంక - టిడిపి తరపున వీరవల్లి చంద్రశేఖర్ బరిలోకి

ప్రజాశక్తి - ఏలూరు

ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా స్థానిక సంస్థల ఎంఎల్‌సి స్థానాలకు బుధవారం నాలుగు నామినేషన్లు దాఖలయ్యాయి. వైసిపి తరపున జిల్లా పరిషత్ ఛైర్మన్ కవురు శ్రీనివాస్, తణుకుకు చెందిన వంకా రవీంద్రనాథ్, వంకా రాజకుమారి, టిడిపి తరపున వీరవాసరం మండలానికి చెందిన వీరవల్లి చంద్రశేఖర్ తమ నామినేషన్లను జిల్లా కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్, ఎన్నికల రిటర్నింగ్ అధికారి పి.అరుణ్‌బాబుకు నామినేషన్ పత్రాలను అందజేశారు. వంకా రవీంద్రనాథ్, కవురు శ్రీనివాస్ నామినేషన్ సమయంలో వారి వెంట రాష్ట్ర మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు, ఎంఎల్ఎలు చెరుకువాడ శ్రీరంగనాథరాజు, కొఠారు అబ్బయ్యచౌదరి తదితరులు ఉన్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా స్థానిక సంస్థల రెండు ఎంఎల్‌సి స్థానాలకు ఇప్పటి వరకు మొత్తం ఐదు నామినేషన్లు దాఖలయ్యాయి. నామినేషన్ల స్వీకరణ ప్రక్రియలో డిఆర్ఒ, సహాయ రిటర్నింగ్ అధికారి ఎవిఎస్ఎస్.మూర్తి తదితరులు పాల్గొన్నారు.

పాలకొల్లు: ఎంఎల్‌సి అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసేందుకు జెడ్‌పి ఛైర్మన్ కవురు శ్రీనివాస్ పాలకొల్లు నుంచి తన అనుయాయులతో ఊరేగింపుగా ఏలూరు తరలి వెళ్లారు. ఆయన వెంట ఎస్‌సి కమిషన్ సభ్యులు చెల్లెం ఆనంద ప్రకాష్, డిసిఎంఎస్ మాజీ ఛైర్మన్ యడ్ల తాతాజీ, గుణ్ణం నాగబాబు తదితరులున్నారు.

తణుకు: ఎంఎల్‌సి అభ్యర్థిగా నామినేషన్ వేయడానికి తణుకు పట్టణానికి చెందిన వంక రవీంద్రనాథ్ బుధవారం ఏలూరు ర్యాలీగా బయలుదేరి వెళ్లారు. తొలుత పట్టణంలో వినాయకుని ఆలయంలో రవీంద్రనాథ్, రాజకుమారి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట వైసిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలివెళ్లారు.



నామినేషన్ పత్రాలను సమర్పిస్తున్న వంకా రవీంద్రనాథ్

పరిహారం చెల్లింపులో కోతలు దారుణం

సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి

ప్రజాశక్తి - వేలేరుపాడు

పోలవరం ప్రాజెక్టు కోసం సర్వం కోల్పోయిన నిర్వాసితులకు గృహ నష్టపరిహారాల్లో భారీ కోతలు విధించి ప్రభుత్వం వారికి అన్యాయం చేస్తుందని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి మండిపడ్డారు. మండలంలోని పసంతవాడలో బుధవారం పూసం రాంబాబు అధ్యక్షతన శాఖా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన రవి మాట్లాడుతూ నిర్వాసితులు ముంపు ప్రాంతాల్లో నష్టపోతున్న ఇళ్లకు ఇచ్చే విలువను పూర్తిగా తగ్గించి వారికి అన్యాయం చేస్తున్నారని వాపోయారు. గతంలో పలుమార్లు సర్వేలు నిర్వహించి గ్రామసభలో తుది జాబితా ప్రకటించిన ఇంటి విలువలకు ఇప్పుడు ప్రకటించిన ఇంటి విలువకు ఏమాత్రమూ పొంతనలేదని, ప్రతీ ఇంటికి మూడు వంతుల విలువలు తగ్గించారని, నిర్వాసితులుగా మారేవారికి గృహాలకు ఇచ్చే పరిహారంలో అనేక కోతలు పెట్టడం సబబు కాదని విమర్శించారు. అలాగే 18 సంవత్సరాల నుండి యువతీ యువకుల గురించి ఆలోచించడం గానీ వారికి ప్యాకేజీ వర్తింపచేయాలని కానీ, మిగులు భూముల సమస్యలు గాలికి వదిలేసి సర్వేల పేరుతో అర్థుల్లను కూడా తొలగిస్తున్నారు తప్ప కొత్త వారి ఊసే లేదని దుయ్యబట్టారు. ప్రభుత్వం స్పందించి సర్వం కోల్పోతున్న నిర్వాసితులకు న్యాయం చేయాలని ఇంటి విలువలు తగ్గడంపై పున:పరిశీలన చేసి పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ఇంటి విలువలు పెంచి నిర్వాసితులకు న్యాయం చేయాలన్నారు. లేనిపక్షంలో నిర్వాసితులందరినీ ఏకతాటిపైకి తీసుకువచ్చి వారికి న్యాయం జరిగే వరకూ సిపిఎం అండగా ఉంటుందని, ఎంతటి పోరాటాల కైనా సిద్ధమేనన్నారు.

ఈ సమావేశంలో పార్టీ మండల కార్యదర్శి ధర్మాల రమేష్, మండల కమిటీ సభ్యులు మడివి దుర్గారావు, కారం వెంకట్రావు, ఏసు, రాంబాబు పాల్గొన్నారు.

సమావేశంలో పాల్గొన్న సెట్‌వెల్ సిఇఒ మెహర్రాజ్

యువత సన్మార్గంలో నడిచేలా ప్రణాళికలు

సెట్‌వెల్ సిఇఒ మెహర్రాజ్

ప్రజాశక్తి - చింతలపూడి

యువత చెడు మార్గంలోకి వెళ్లకుండా మంచి మార్గంలో నడిచేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని సెట్‌వెల్ సిఇఒ ఎమ్‌డి.మెహర్రాజ్ అన్నారు. పట్టణంలోని ఎంపిడిఒ కార్యాలయంలో యూత్ క్లబ్‌ల ఏర్పాటుపై పంచాయతీ కార్యదర్శులకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మెహర్రాజ్ మాట్లాడుతూ ప్రతి గ్రామ సచివాలయంలో పది నుంచి 15 మంది యువతీ యువకులతో యూత్ క్లబ్ ఏర్పాటు చేయాలన్నారు. వయస్సు 18 నుంచి 35 సంవత్సరాల్లోపు ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపిడిఒ మణికుమారి, అధికారులు పాల్గొన్నారు.

పంచాయతీ నిధుల స్వాహాపై విచారణ

ప్రజాశక్తి - పెదవేగి

మండలంలోని అమ్మపాలెం పంచాయతీ నిధుల స్వాహాపై విచారణ అధికారి ఇఒపిఆర్‌డి శ్రీనివాస్ బుధవారం విచారణ చేపట్టారు. తదుపరి చర్యల నిమిత్తం ఉన్నతాధికారులకు సిఫార్సు చేశారు. అయితే ఉన్నతాధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచిచూడాల్సి ఉంది. అమ్మపాలెం మహిళా సర్పంచి వేలిముద్రతో పాటు సంతకాన్ని కూడా ఆ పంచాయతీ గ్రేడ్-1 కార్యదర్శి (పంచాయతీ డ్రాయింగ్ అధికారి) మండలంలో కొన్ని పంచాయతీల్లో అవుట్ సోర్సింగ్ కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న వ్యక్తితో కలిసి అమ్మపాలెం మహిళా సర్పంచి దేవరపల్లి ఏసుమరియమ్మ వేలి ముద్రతో పాటు సంతకాన్ని కూడా ఫోర్జరీ చేసినట్లు ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు. వీటిలో లైట్లు కొనుగోలు నిమిత్తం రూ.79,990, పైపు లైన్ల రిపేర్ నిమిత్తం రూ.86,450 స్వాహా అయినట్లు తేల్చారు. పంచాయతీ నిధులు కార్యదర్శి వై.సుప్రియ అనే ఒక మహిళ పేరుతో ఉన్న బ్యాంక్ అక్కౌంట్‌కు బదిలీ చేసినట్లు తెలిసింది. పంచాయతీ అక్కౌంట్ నుండి ఎస్‌బిఐ ఏలూరు ఐఎఫ్ఎస్‌సి కోడ్ ఎస్‌బిఐఎన్0000836గాను, అక్కౌంట్ నంబర్ 20133354697కు సిఎఫ్ఎంఎస్ కోడ్ 1009321125తో రెండు బిల్లులు తయారు చేసి గతనెల 24వ తేదీన పంచాయతీ నిధులు మొత్తం రూ.86,440 ఏలూరు స్టేట్ బ్యాంక్ నుండి డ్రా చేయడానికి రెండు వేర్వేరు ఓచర్లు రాసి పక్కా ఆధారాలతో దొరికిపోయారు. ఈ పంచాయతీ నిధులు ఎవరి పేరున ట్రాన్స్‌ఫర్ చేశారో ఆ ఓచర్లపై ఏ డ్రాయింగ్ అధికారి సంతకముందో జిల్లా అధికారులు పరిశీలిస్తే అసలు విషయం తెలుస్తుంది.

రాష్ట్రస్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌కు లక్కవరం విద్యార్థి

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

రాష్ట్రస్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌కు మండలంలోని లక్కవరం జెడ్‌పిహెచ్ పాఠశాల విద్యార్థి పోతన మహేష్ ఎంపికయ్యాడు. బుధవారం విద్యార్థి పోతన మహేష్‌ను ఎంపిపి కొదమ జ్యోతి అభినందించారు. ఈ నెల 20, 21 తేదీల్లో ఏలూరులో జరిగిన జిల్లాస్థాయి సైన్స్ ఫేర్ పోటీలలో సాఫ్ట్‌వేర్ యాప్స్ విభాగం నుండి లక్కవరం శ్రీరాజా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న ద్వారకాతిరుమల మండలం రాఘవాపురానికి చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థి పోతన మహేష్ ప్రథమ స్థానం సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికవ్వడం అభినందనీయమని ఎంపిపి కొదమ జ్యోతి కొనియాడారు. అలాగే ఈనెల 27, 28 తేదీల్లో విజయవాడలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో మహేష్ పాల్గొంటాడని తెలిపారు. అలాగే విద్యార్థి మహేష్ గ్రామ సర్పంచి వెంకటరమణ, ఎంపిటిసి వెంకట మోహన్‌రెడ్డితో పాటు పాఠశాల విద్యా కమిటీ ఛైర్మన్ చిల్లా దుర్గారెడ్డి, ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు టి.ఆనంద్‌కుమార్, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

28లోపు పన్ను చెల్లించాలి

భీమడోలు: మండల పరిధిలోని 13 గ్రామ పంచాయతీలకు చెందిన ఇంటి , కుళాయి పన్ను చెల్లింపుదారులు ఈనెల 28వ తేదీలోగా చెల్లించాలని ఎంపిడిఒ రాఘవన్ కోరారు. ఇంటి పన్ను రూ.మూడు కోట్ల ఐదు లక్షలు వసూలు కావాల్సి ఉండగా 49 శాతం మాత్రమే పన్ను వసూలు జరిగిందన్నారు. ఇతర పన్నుల రూపంలో రూ.1.46 కోట్లు వసూలు కావల్సి ఉండగా 32 శాతం మాత్రమే వసూలైందన్నారు. నిర్ణీత గడువులోగా పన్ను చెల్లించని వారి తాగునీటి కుళాయిలకు డమ్మీలు వేస్తామని, ఇంటి పన్ను బకాయిదారులకు కోర్టు నోటీసులు పంపుతామని తెలిపారు. పన్నులను చెల్లించేందుకు ఆసక్తి కలవారు తమ వివరాలను గ్రామపంచాయతీ కార్యదర్శి, గ్రామ సచివాలయ సిబ్బంది దృష్టికి తెస్తే వారి సిఫార్సు మేరకు సంబంధిత గ్రామపంచాయతీ బిల్లు కలెక్టర్ వారు ఇంటి వద్దకు వచ్చి పన్ను వసూలు చేసి రసీదులు అందజేస్తారని తెలిపారు.

సౌత్ స్టార్ సిరామిక్ ఫ్యాక్టరీ కాలుష్యంతో

దెబ్బతిన్న మొక్కజొన్న

మొక్కజొన్న మొక్కలను పరిశీలిస్తున్న సిపిఎం నేతలు

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

తిమ్మాపురంలోని సౌత్ స్టార్ సిరామిక్ ఫ్యాక్టరీ కాలుష్యం వల్ల సుమారు 20 ఎకరాల్లో దెబ్బతిన్న వివిధ పంటలను సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్.లింగరాజు బుధవారం పరిశీలించారు. సిరామిక్ ఫ్యాక్టరీ కాలుష్య నియంత్రణ మండలి నిబంధనలను గాలికొదిలి కాలుష్యాన్ని అంతా రైతుల పంట పొలాలపై వదిలి తీవ్ర నష్టానికి గురి చేయడం దారుణమన్నారు. గత మూడు సంవత్సరాల నుంచి రైతులు దఫదఫాలుగా విన్నవించినా, ఆందోళన చేసినా అదిగో.. ఇదిగో అని కాలక్షేపం చేయడం తప్ప కాలుష్య నియంత్రణకు నేటికీ ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం రైతుల నోట్లో మట్టి కొట్టడమేనని ఆయన అన్నారు. గ్యాస్ పైప్‌లైన్ పనులు రెండు సంవత్సరాలుగా చేస్తున్నా నేటికీ పూర్తి చేయలేకపోవడం ఫ్యాక్టరీ యాజమాన్య నిర్లక్ష్య వైఖరికి నిదర్శనమన్నారు. రెండు సంవత్సరాలుగా 20 మంది రైతులు పంటలు పండక లక్షలాది రూపాయలు నష్టపోయారని, తక్షణమే నష్టపరిహారం ఇచ్చి రైతులను ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రైతులను సమీకరించి ఆందోళన చేస్తామని హెచ్చరించారు. నష్టపోయిన రైతులు పెళ్ళి గాంధీ, బొక్కా సత్యనారాయణ తదితరులు మాట్లాడుతూ వేలాది రూపాయలు కౌలు చెల్లిస్తూ, మరోవైపు సాగుకు పెట్టుబడి పెట్టి రూ.లక్షలు నష్టపోయామని వాపోయారు. ఫ్యాక్టరీ యాజమాన్యం తమకు నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని, లేనిపక్షంలో ఆందోళన తప్ప వేరే మార్గం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం దెబ్బతిన్న మొక్కజొన్న పొత్తులను ప్రదర్శిస్తూ ఫ్యాక్టరీ గేటు ముందు రైతులు నిరసన తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, రైతులు పాల్గొన్నారు. ఫలితంగా సౌత్ స్టార్ సిరామిక్ ఫ్యాక్టరీ యాజమాన్యం రైతులతో చర్చలు జరిపింది. ఈ నెలాఖరులోపు రైతులకు నష్టపరిహారం చెల్లిస్తామని యాజమాన్యం హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు.

మధ్యాహ్న భోజన కార్మికులను విస్మరిస్తున్న ప్రభుత్వం

సిఐటియు జిల్లా కార్యదర్శి మొడియం నాగమణి - వేతనాలు, మెనూ ఛార్జీలు పెంచాలని డిమాండ్

ప్రజాశక్తి - కుక్కునూరు



మాట్లాడుతున్న మొడియం నాగమణి

మధ్యాహ్నం భోజన కార్మికుల మెనూ ఛార్జీలు పెంచి ప్రమాద బీమా అమలు చేయాలని మధ్యాహ్నం భోజన కార్మికుల యూనియన్ (సిఐటియు) జిల్లా కార్యదర్శి మోడియం నాగమణి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం యూనియన్ సమావేశం గంగమ్మ అధ్యక్షతన సుందరయ్య భవనం ప్రజాసంఘాల కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా నాగమణి మాట్లాడుతూ పేద విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలని, అహర్నిశలు కృషి చేస్తున్న మధ్యాహ్నం భోజన కార్మికుల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. ఈనెల ఒకటో తేదీ నుంచి రాగి ముద్ద తప్పనిసరిగా పెట్టాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని, కానీ దానికి సంబంధించి పిండి ప్రభుత్వం సరఫరా చేస్తుందా, లేక మెనూ ఛార్జి పెంచుతుందా అన్ని విషయం చెప్పలేదన్నారు. అలాగే కొత్త మెనూ చాలా కష్టంగా మారుతుందని, అలాగే స్కూల్ మెర్జ్ పేరుతో చాలా మంది కార్మికులను ప్రభుత్వం తొలగించిందని తెలిపారు. హై స్కూల్లో 9, 10 పిల్లలకు వంట చేస్తున్న కార్మికులకు కనీస వేతనం కూడా లేకుండా వెట్టి చాకిరీ చేయించుకుంటూ కొత్త మెనూలు అమలు చేస్తుందన్నారు. వంటకు సరిపడు వర్కర్స్ గానీ, వంట పాత్రలు గానీ, గ్యాస్ సదుపాయం గానీ కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. ప్రమాద బీమా అమలు చేయాలని, మార్కెట్ రేటుకు అనుగుణంగా మెనూ ఛార్జీలు పెంచాలని, గుర్తింపు కార్డులు, కాటన్ యూనిఫారాలు ఇవ్వాలని, రాజకీయ వేధింపులు, అక్రమ తొలగింపులు ఆపాలని, ప్రతీ సంవత్సరం వర్కర్స్‌ని మార్చకుండా ఒక్కరినే కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సిఐటియు కుక్కునూరు మండల అధ్యక్ష కార్యదర్శులు కుంజ నాగలక్ష్మి, యర్రం సాయికిరణ్, కార్మికులు పుష్ప, చిట్టెమ్మ, గంగమ్మ, ఉమ, దుర్గమ్మ పాల్గొన్నారు.

సమావేశమైన టిడిపి నేతలు

స్థానికునికే ఎంఎల్ఎ టిక్కెట్ కేటాయించాలి

చింతలపూడి నియోజకవర్గ టిడిపి నేతలు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

2024 చింతలపూడి నియోజకవర్గ టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థిగా స్థానికులకు ప్రాధాన్యత ఇవ్వాలని పార్టీ ఎస్‌సి సెల్ మండల అధ్యక్షులు గొల్లమందల శ్రీనివాసరావు ఆశాభావం వ్యక్తంచేశారు. బుధవారం పార్టీ కార్యాలయంలో గొల్లమందల శ్రీనివాసరావు అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సమావేశంలో నాన్ లోకల్ వద్దు.. లోకల్ ముద్దు అను నినాదాన్ని టిడిపి అధిష్టానానికి వినిపిస్తామని శ్రీనివాసరావు తెలిపారు. అలాగే చింతలపూడి నియోజకవర్గానికి ఎమ్మెల్యే టిక్కెట్ ఆశిస్తున్న స్థానికేతర అభ్యర్థులకు చింతలపూడి నియోజకవర్గంలో ఉన్న చాలా ప్రధాన సమస్యలు తెలియదని చెప్పారు. వార్డుల్లో పార్టీ కోసం అహర్నిశలు కష్టపడుతున్న స్థానిక నాయకులు, కార్యకర్తలు తెలియకపోవడం వల్ల చింతలపూడి నియోజకవర్గంలో నాన్ లోకల్ అభ్యర్థులు ప్రజలకు తగిన న్యాయం చేయలేకపోతున్నారని తెలిపారు. దీనివల్ల పార్టీకి నష్టం కలిగే అవకాశం ఉందన్నారు. స్థానికేతర అభ్యర్థులకు ఎమ్మెల్యే టికెట్ ఇస్తే ఐదు సంవత్సరాల అనంతరం నియోజకవర్గం వైపు కన్నెత్తి చూడడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. నియోజకవర్గ అభివృద్ధిని వెనక్కి నెట్టి, పార్టీని ప్రశ్నార్థకంగా చేసి వెళ్లిపోతున్నారని, కార్యకర్తలకు కష్టం వస్తే ఆదుకునే నాధుడే లేకుండా నియోజకవర్గ ప్రజల పరిస్థితి అగమ్యగోచరంగా ఉంటుందని తెలిపారు. త్వరలోనే ఏలూరు జిల్లా టిడిపి అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు ద్వారా పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబుకు వినతిని అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి బొబ్బర రాజ్‌పాల్, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పాతూరి అంబేద్కర్, రాష్ట్ర మహిళా కార్యనిర్వాహక కార్యదర్శి పగడం సౌభాగ్యవతి, ఐటిడిపి చింతలపూడి నియోజకవర్గ అధ్యక్షులు బోడ అనీష్‌కుమార్, చింతలపూడి నియోజకవర్గ ఎస్‌సి సెల్ అధ్యక్షులు పల్లి శ్రీను, చింతలపూడి నియోజకవర్గ నాయకులు మారుమూడి థామస్, ఎమ్మెల్యే ఆశావాహి గద్దె శివ కోటేశ్వరరావు, ఏలూరు జిల్లా తెలుగు యువత కార్యదర్శి బొకినాల వాసు పాల్గొన్నారు.

రూ.20 లక్షలు పరిహారం ఇవ్వాలి

ప్రజాశక్తి - ఉంగుటూరు

ఎంఇఒకు వినతిని అందిస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

వంట చేస్తుండగా అగ్నిప్రమాదానికి గురై మరణించిన మధ్యాహ్న భోజనం కార్మికురాలి కుటుంబానికి రాష్ట్రప్రభుత్వం రూ.20 లక్షల పరిహారం చెల్లించాలని సిఐటియు జిల్లా కార్యదర్శి కొక్కిరిపాటి వెంకట్రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఎంఇఒకు మధ్యాహ్న భోజనం కార్మికులు సిఐటియు ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వెంకట్రావు మాట్లాడుతూ శ్రీకాకుళం జిల్లా మెలియాపుట్టి మండలంలో మధ్యాహ్నం భోజనం పథకంలో పిల్లలకు వంట చేస్తుండగా అగ్ని ప్రమాదానికి గురై మృతి చెందిన మలిపెద్ది రమ కుటుంబానికి రాష్ట్రప్రభుత్వం నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలని కోరారు. 20 ఏళ్లుగా వంట కార్మికురాలిగా పని చేస్తున్న రమ ఈ నెల 14న పాఠశాలలో వంట చేస్తుండగా ఆమె చీరకాలి ఒంటినిండా గాయాలపాలైందన్నారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి ఈ నెల 18న మరణించిందన్నారు. ఆమెది నిరుపేద కుటుంబమని, వంటపనే జీవనాధారంగా బతుకుతున్నారన్నారు. పెద్దదిక్కుగా ఉన్న ఆమె చనిపోవడంతో ఆ కుటుంబం రోడ్డుపాలయ్యే ప్రమాదం ఉందన్నారు. ఆ కుటుంబాన్ని ఆదుకోవాల్సిన బాధ్యత రాష్ట్రప్రభుత్వంపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్నం భోజన పథకం కార్మికుల సంఘం జిల్లా నాయకురాలు భోగా అనంతలక్ష్మి, లక్ష్మీపార్వతి, ఎస్.సునీత, ఒగ్గు లక్ష్మి, జె.నిర్మల, ఇ.రూతమ్మ, కె.వెంకటరత్నం, పి.ఈశ్వరి పాల్గొన్నారు.

వైసిపి అరాచక పాలనకు చరమగీతం : టిడిపి

ప్రజాశక్తి - కైకలూరు

వైసిపి అరాచక పరిపాలనకు రోజులు దగ్గర పడ్డాయని, ఆ పార్టీకి చరమగీతం పాడుతామని టిడిపి నాయకులు ధ్వజమెత్తారు. బుధవారం మండలంలోని వరహపట్నంలో ఇదేం ఖర్మ మనరాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు పెన్నస త్రినాథ రాజు, పార్టీ గ్రామ అధ్యక్షులు పళ్లెం తాతారావు, రాష్ట్ర వాణిజ్య విభాగం ప్రధాన కార్యదర్శి పిజెఎస్ మాల్యాద్రి, మాజీ జెడ్‌పిటిసి సభ్యులు బి.విజయలక్ష్మి, ప్రసాద్‌రాజు, మండల ప్రధాన కార్యదర్శి పి.రాధాకృష్ణ, ఏలూరు పార్లమెంటు కార్యనిర్వాహక కార్యదర్శి పోలవరపు లక్ష్మీరాణి పాల్గొన్నారు.

ఆదమరిస్తే అంతే..!

ప్రమాదకరంగా మలుపు

స్పీడ్ బ్రేకర్లు, హెచ్చరిక బోర్డులు కూడా లేని పరిస్థితి

ప్రజాశక్తి - చింతలపూడి

చింతలపూడి పట్టణంలోని ప్రభుత్వ డీగ్రీ కళాశాల వద్ద మలుపు ప్రమాదకరంగా మారింది. నిత్యం ఏదో ఒక ప్రమాదం జరుగుతుందంటే ఇక్కడ పరిస్థితి ఎంత భయానకంగా ఉందో అర్థమవుతుంది. ముఖ్యంగా ఈ ప్రాంతంలో ప్రమాద హెచ్చరిక బోర్డులు, స్పిడ్ బ్రేకర్స్ వంటివి లేకపోవడం, అతివేగం ప్రమాదాలకు కారణమవుతున్నాయి. ఒక్కో సందర్భంలో హెల్మెట్ లేకపోవడంతో ప్రమాదాల్లో మృత్యువాతపడుతున్నారు. ఇక్కడి పరిస్థితులు ఆందోళన కలిగిస్తున్నాయి. వీటితో పాటు డ్రంక్ అండ్ డ్రైవ్, ఎలాంటి శిక్షణా లేకుండా వాహనం నడపడం వంటి కారణాలవల్ల ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు స్పందించి స్పీడ్ బ్రేకర్లు, ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని పట్టణ ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

పార్టీలకు అతీతంగా ఇళ్ల స్థలాలివ్వాలి : సిపిఎం

పెదపాడు:మండలంలో అర్హులైన పేదలందరికీ ఇళ్లు, పార్టీలకు అతీతంగా ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కె.శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక నర్రా ఆంజనేయులు భవనంలో సిపిఎం మండల కమిటీ సమావేశం ఆ పార్టీ సీనియర్ నాయకులు లింగం కృష్ణారావు అధ్యక్షతన నిర్వహించారు. మండలంలోని పలు ప్రజాసమస్యలను చర్చించి తీర్మానాలు ఆమోదించారు. ఇంటి నిర్మాణం కోసం లబ్ధిదారుడికి ఇస్తున్న రూ.లక్షా 80 వేలు సరిపోవడంలేదని రూ.ఐదు లక్షలకు పెంచాలని కోరారు. లేకుంటే ప్రభుత్వమే ఇల్లు నిర్మించి ఇవ్వాలన్నారు. అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలిచ్చే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. అర్హులకు రేషన్ కార్డులు మంజూరు చేయాలన్నారు. అలాగే రైతులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని, వాటిని పరిష్కరించాలని డిమాండ్ చేశారు. రైతులకు, కౌలు రైతులకు ధాన్యం బకాయి సొమ్ములు చెల్లించాలని కోరారు. పెసర, మినుము రైతులకు దిగుబడులు రాక నష్టపోతున్నారని, పండిన పంటనైనా ప్రభుత్వం కొనుగోలు చర్యలు చేపట్టాలని, అపరాల కొనుగోలు కేంద్రాలు తెరవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో గుండపనేని సురేష్, పిట్టా రహేల్, ముసునూరి కొండలరావు, రెడ్డి లక్ష్మణరావు, జాన్ సాయి పాల్గొన్నారు.

రూ.10వేలు ఇచ్చి రూ.30 వేలు లాగుతున్న జగన్ : టిడిపి

చింతలపూడి :సిఎం జగన్ ప్రభుత్వం ఒక చేతికి రూ.10 వేలు ఇస్తూ మరో చేతి నుండి తెలియకుండానే రూ.30 వేలు లాక్కుంటూ పేదలను దోచుకుంటున్నారని టిడిపి పట్టణ అధ్యక్షులు పక్కాల వెంకటేశ్వరావు, పట్టణ ప్రధాన కార్యదర్శి బోడా నాగభూషణం అన్నారు. చింతలపూడి నగర పంచాయతీ పరిధిలోని రెండో వార్డు ఛార్లెస్ నగర్‌లో ఇదేం ఖర్మ రాష్ట్రానికి కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌ఛార్జి మన్యం సత్తిబాబు, ఐటిడిపి చింతలపూడి నియోజకవర్గ అధ్యక్షులు బోడా అనీష్‌కుమార్, ఎస్‌సి సెల్ చింతలపూడి నియోజకవర్గ అధ్యక్షులు పల్లి శ్రీను, జిల్లా రైతు కార్యదర్శి కొత్తపూడి శేషగిరిరావు, స్థానిక టిడిపి నాయకులు సొంగా ఏసుపాదం, నలమాటి శ్రీనివాసరావు, టిఎన్ఎస్ఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి గద్దె శివ పాల్గొన్నారు.

ఘనంగా సిపిఐ (ఎంఎల్) ప్రజాపంథా ఆవిర్భావ దినోత్సవం

కుక్కునూరు:సిపిఐఎంఎల్ ప్రజాపంథా పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం మండలంలోని కుక్కునూరు, కురుములతోగు, నెమలిపేట, లంకాలపల్లి గ్రామాల్లో పార్టీ జెండాలను ఆవిష్కరించి ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జంగారెడ్డిగూడెం డివిజన్ కార్యదర్శి ఎస్‌కె.గౌస్ మాట్లాడుతూ అతివాద, మితవాద, అవకాశవాద ధోరణులకు వ్యతిరేకంగా ప్రజాపంథాలో పయనిస్తూ ప్రజాసమస్యలపై విశాల ఉద్యమాన్ని నిర్మించి పీడిత, తాడిత, అణగారిన నిమ్నవర్గాలకు అండగా నిలిచేందుకు సిపిఐఎంఎల్ ప్రజాపంథా పార్టీ ఆవిర్భవించిందన్నారు. ఈ సందర్భంగా భూమి, భుక్తి, విముక్తి కోసం పోరాడి అశువులు బాసిన వేలాదిమంది అమరవీరుల ఆశయాలను స్మరించుకున్నారు. వారి స్ఫూర్తితో రానున్న రోజుల్లో ప్రజాసమస్యలపై, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా, కార్మిక, కర్షక, రైతు వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమించాలని ఆయన ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు బి.సత్యనారాయణ, కంగాల కల్లయ్య, మడకం మల్లేష్, కొండా ప్రసాద్, శ్రీను, రాంబాబు పాల్గొన్నారు.

చెట్ల కొమ్మలు నరుకుతున్న వారిపై చర్యలు తీసుకోవాలి : సిపిఎం

టి.నరసాపురం:మండలంలోని మధ్యాహ్నపువారిగూడెం మల్లుకుంట వరకు ఆర్‌అండ్‌బి రోడ్డు పక్కన ఉన్న చెట్ల కొమ్మలు అక్రమంగా నరికి అమ్ముకుంటున్నవారిపై చర్యలు తీసుకోవాలని సిపిఎం మండల కార్యదర్శి తుమ్మల సత్యనారాయణ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 40 సంవత్సరాల పైబడి రోడ్డుకు ఇరువైపులా ఉన్న మామిడి, మర్రి చెట్లు బాటసారుల సేదతీర్చేందుకు ఉపయోగపడుతున్నాయన్నారు. తిరుమలదేవిపేట శివారు శ్మశానం వద్ద ప్రజలు అంత్యక్రియలు చేసే సమయంలో ఈ చెట్టు నీడని కూర్చునే వారన్నారు. అయితే విద్యుత్ లైన్ల పేరుతో అక్రమంగా చెట్టుని తొలగించి పెద్దపెద్ద కొమ్మలను కట్టెలుగా అమ్మేస్తున్నారని, ఆర్‌అండ్‌బి, విద్యుత్ శాఖల అధికారులు కాంట్రాక్టర్లు ఇచ్చే డబ్బులకు ఆశపడి అనుమతులు ఇస్తున్నారని విమర్శించారు. విద్యుత్ లైన్ ఉన్నచోట మాత్రమే చెట్లను తొలగించాలని అధికారులు చెప్పినప్పటికీ విద్యుత్ తీగలకు సంబంధం లేకుండా ఉన్న పెద్దపెద్ద కొమ్మలను కూడా కోత మిషన్‌తో కోసి తరలిస్తున్నారని పేర్కొన్నారు. ఇటీవల తిరుమలదేవిపేట శ్మశాన వాటికి దగ్గర మామిడి చెట్టు తొలగించే సమయంలో గ్రామస్తులు ఆందోళన చేయడంతో ఆపారని, వారికి సిపిఎం సహకరించిందని తెలిపారు. ఇటీవల రోడ్డు పక్కన మొక్కలు చనిపోయాయన్న కారణంతో 32 మంది ఉపాధి హామీ ఉద్యోగులను సస్పెండ్ చేశారని, మొక్కలు చనిపోతే చర్యలు తీసుకున్న అధికారులు చెట్లు అక్రమంగా నరికి తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

శ్రీజ్యోతి బంగారు నగల దుకాణం ప్రారంభం

జంగారెడ్డి గూడెం:అన్నిరంగాల్లో దూసుకుపోతున్న జంగారెడ్డిగూడెం బంగారం వ్యాపారంలో కూడా ముందంజ వేయాలని మహిళా శిశు సంక్షేమ శాఖ రీజనల్ ఛైర్‌పర్సన్ వందనపు సాయి బాలపద్మ అన్నారు. బుధవారం స్థానికి పొట్టి శ్రీరాములు జంక్షన్ మహంకాళిబాబు కాంప్లెక్స్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీజ్యోతి జ్యూవెలరీ షోరూమ్‌ను సాయి బాల పద్మ, వెంకటేశ్వర రావు దంపతులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రేడ్-2 మున్సిపాలిటీగా ఉన్న పట్టణం త్వరలో గ్రేడ్-1కి చేరుతుందన్నారు. వాణిజ్యరంగం వృద్ధి చెందాలని ఆశాభావం వ్యక్తంచేశారు. తొలి కొనుగోలు వందనపు రామ్మోహన్‌రావు, వందనపు అప్పలరాజు చేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధినేతలు వాసవీ క్లబ్ ఇంటర్ ఇంటర్నేషనల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ మహంకాళి, మురళీధర్, వినోద్‌బాబు, వాసవీక్లబ్ ఇంటర్ నేషనల్ ఫాస్ట్ ప్రెసిడెంట్ వేణుగోపాల్, వర్తక ప్రముఖులు కేసనపల్లి సీతారామ చంద్రరావు, వందనపు ఆంజనేయులు, రిటైర్డ్ డిఎఫ్ఓ కె.సత్యనారాయణ పాల్గొన్నారు.

డిసిఇబి సర్వేశ్వరరావుకు యుటిఎఫ్ అభినందనలు

ఏలూరు టౌన్:జిల్లా ఉమ్మడి పరీక్షల నిర్వహణ (డిసిఇబి) కార్యదర్శిగా బాధ్యతలు చేపడుతున్న అంగులూరి సర్వేశ్వరరావును యుటిఎఫ్ ఏలూరు మండలశాఖ ప్రతినిధులు బుధవారం కలిసి అభినందనలు తెలిపారు. ప్రస్తుతం శనివారపుపేట జెడ్‌పి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయునిగా పనిచేస్తున్న సర్వేశ్వరరావు గతంలో అనేక పదవుల్లో అత్యున్నత సేవలు అందించారని యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి నంబూరి రాంబాబు, మండల అధ్యక్షులు పాతూరి సురేష్‌బాబు, బోడా ప్రభాకర్‌రావు పాల్గొన్నారు.

ఆదిలోనే వైకల్యాలను గుర్తించాలి

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

పిల్లలకు ప్రాథమిక దశలోనే వైకల్యాలను గుర్తించి నివారణ చర్యలు చేపట్టడం ద్వారా కొంతమేర వ్యాధి తీవ్రతను తగ్గించవచ్చని జిల్లా వికలాంగుల పునరావాస కేంద్రం (డిడిఆర్‌సి) ఫిజియోథెరపిస్ట్ జి.రాంబాబు పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోని సామాజిక న్యాయ, సాధికారత మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఏలూరు కలెక్టర్ కార్యాలయ ఆవరణలో ఉన్న ఉమా ఎడ్యుకేషనల్ టెక్నికల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న డిడిఆర్‌సి సాంకేతిక నిపుణుల బృందం మండలంలోని మల్కాపురం గ్రామ సచివాలయంలో జిల్లా వికలాంగుల పునరావాస కేంద్రం అందిస్తున్న సేవలపై అవగాహన సదస్సు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎర్లీ ఇంటర్వెన్షన్ పెంపొందించడంపై అవగాహన కల్పించారు. మల్కాపురం గ్రామపంచాయతీ సెక్రటరీ సుమలత మాట్లాడుతూ పునరావాస కేంద్రం ద్వారా వికలాంగులకు అనేక సేవలు అందిస్తున్నారన్నారు. ముఖ్యంగా కృత్రిమ అవయవాలు (ఆర్టిఫిషియల్ లిమ్బ్స్/క్యాలిపర్స్), స్పీచ్ థెరపీ, ఫిజియోథెరపీ, మానసిక వికలాంగులకు కౌన్సిలింగ్ వంటి సేవలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. సంస్థ అందిస్తున్న సేవలను ఉపయోగించుకోవాలని ఉమా ఎడ్యుకేషనల్, టెక్నికల్ సొసైటీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పెద్దిరెడ్డి సూచించారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ సుమలత, వెల్ఫేర్ అసిస్టెంట్ సుజాత, ఆశా వర్కర్లు, వాలంటీర్లు, పునరావాస కేంద్రం సిబ్బంది, స్పెషల్ ఎడ్యుకేటర్ రష్మిత, జయలక్ష్మి, అకౌంటెంట్ నాగరాజు పాల్గొన్నారు.

శరవేగంగా భీమడోలు మార్కెట్ అభివృద్ధి పనులు

ప్రజాశక్తి - భీమడోలు

ఇదే మార్కెట్ స్థలం

భీమడోలు గ్రామపంచాయతీ పాలకవర్గం చొరవతో గ్రామపంచాయతీ కార్యదర్శి ఠాగూర్ ఆధ్వర్యంలో చేపట్టిన భీమడోలు మార్కెట్ అభివృద్ధి పనులు శరవేగంగా సాగుతున్నాయి. సుమారు ఎకరం విస్తీర్ణంలోని భీమడోలు మార్కెట్లో పదేళ్ల క్రితం ఎస్‌సి కార్పొరేషన్ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించారు. కాలక్రమేణా అది శిథిలం కావడంతో ఆదాయం రావడం లేదు. నిరుపయోగంగా ఉన్న షాపింగ్ కాంప్లెక్స్ స్థలం సంత అభివృద్ధి కార్యక్రమాలకు అడ్డంకిగా మారాయి. ఈ నేపథ్యంలో గ్రామ సర్పంచి సునీత మాన్‌సింగ్ ఈ విషయాన్ని కలెక్టర్‌కు తెలిపారు. దీనిపై విచారణ చేపట్టిన కలెక్టర్ షాపింగ్ కాంప్లెక్స్ తొలగింపు ఆదేశాలను జారీ చేశారు. దీంతో ఆక్రమణల తొలగింపులో భాగంగా ఎస్‌సి కార్పొరేషన్ షాపింగ్ కాంప్లెక్స్ శిథిలాల తొలగింపు కార్యక్రమం మంగళవారంతో పూర్తయింది. ఈ సందర్భంగా గ్రామ సర్పంచి, గ్రామ పంచాయతీ కార్యదర్శి మాట్లాడుతూ ప్రస్తుతం సంతపేటలో మిగిలిన ఆక్రమణలను సైతం తొలగించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఆ తర్వాత మార్కెట్‌ను అధునాతన తరహాలో నిర్మిస్తామన్నారు. వివిధ విభాగాల వారీగా అమ్మకాల స్టాల్స్ ఏర్పాటుకు సహకరిస్తామన్నారు. పర్యావరణ నిబంధనలు పాటిస్తామని చెప్పారు. స్టాల్స్ వారి నుంచి గ్రామపంచాయతీ లైసెన్స్ ఫీజులు వసూలు చేస్తుందని, సంతకు వచ్చే వారికోసం వివిధ సౌకర్యాల కల్పన, తాగునీరు, మరుగుదొడ్లు ఇతర ఏర్పాట్లు చేస్తామని చెప్పారు. ఇప్పటి వరకూ రోడ్లమీదే ఉన్న మార్కెట్ కార్యకలాపాల వల్ల రోడ్డుపై ప్రయాణించే వారికి ఇబ్బందిగా ఉండేదన్నారు. ప్రముఖ క్షేత్రం ద్వారకాతిరుమలకు వెళ్ళేందుకు ఇదే ప్రధానరహదారి కావడంతో ప్రయాణికులు, వాహనదారులు ఆ మార్గంపై వెళ్లేందుకు ఇబ్బందులు ఎదుర్కొనేవారని వివరించారు. ప్రతీ బుధవారం భీమడోలులో నిర్వహించే వారపు సంతను సైతం మార్కెట్ ఆవరణలోనే కొనసాగించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. దీనివల్ల ప్రయాణికులకు ఇబ్బంది ఉండదని, పంచాయతీకి అదనపు ఆదాయం వస్తుందని వివరించారు.

వైభవంగా కొల్లేటి పెద్దింట్లమ్మ జాతర

ప్రజాశక్తి - కైకలూరు

కొల్లేటికోట పెద్దింటి అమ్మవారి ఉత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. రెండో రోజు బుధవారం ఉదయం నుండి శ్రీజలదుర్గ సమేత పెద్దింటి అమ్మవారికి సుగంధ ద్రవ్యాభిషేకం, పంచఫల రసాభిషేకం, గంగోధక అభిషేకం నూతన వస్త్రాలంకరణ, పుష్పాలంకరణ, ప్రధమావరణ పూజ, కలశపూజ చేశారు. సయ్యపురాజు దంపతులు ఈ పూజలు చేయించారు. ముదినేపల్లికి చెందిన కట్టా లక్ష్మిరత్నకుమారి ప్రవచనాలు చేశారు. గూడవల్లికి చెందిన మట్టా శ్రీరాములు ఆధ్వర్యంలో శివరంజిని నాట్య మండలి సత్య హరిశ్చంద్ర నాటక ప్రదర్శన యాత్రికులను ఆకట్టుకుంది. ఆలయ కార్యనిర్వహణాధికారి కెవి.గోపాలరావు, ఆలయ సిబ్బంది, యాత్రికులు పాల్గొన్నారు.

ఓపెన్ ఇంటర్ విద్యకు అడ్మిషన్లు ప్రారంభం

ప్రజాశక్తి - ఉంగుటూరు

ఆంధ్రప్రదేశ్ ఓపెన్ స్కూల్ సొసైటీ (ఎపిఒఎస్ఎస్) ద్వారా ఇంటర్మీడియట్ రెండు సంవత్సరాల కోర్సులకు నారాయణపురం మహాత్మగాంధీ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అడ్మిషన్లు జరుగుతున్నాయని ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ బివి.శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. రెండు సంవత్సరాల కోర్సు చదవలేనివారు, రెగ్యులర్ కోర్సు చదివి సగంలోనే మానేసిన వారు కూడా దూర విద్య ద్వారా పరీక్ష రాయొచ్చన్నారు. 2022-23 విద్యా సంవత్సరంలో రెగ్యులర్ విద్యార్థులకు కూడా ఈ అవకాశం ఉందన్నారు. మొదటి దశగా ఈనెల 21 నుంచి 27వ తేదీ వరకూ అడ్మిషన్ పొందొచ్చని తెలిపారు. రెండో దశలో మార్చి ఒకటో తేదీ నుంచి ఏడో తేదీలోగా పరీక్షా ఫీజు చెల్లించవచ్చన్నారు. ఇంటర్ ప్రథమ సంవత్సరం చదివి పరీక్ష రాయలేని వారు, రెండో సంవత్సరం మధ్యలో మానేసిన వారు కూడా ఈ దూర విద్యను సద్వినియోగం చేసుకోవచ్చని చెప్పారు. ఇతర వివరాలకు 9441687844 నెంబర్‌ను సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

ఘనంగా మాతృభాషా దినోత్సవం

చింతలపూడి :మాతృభాష వారోత్సవాలు స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగుశాఖ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల వైస్‌ప్రిన్సిపల్ ఎన్‌కెజె.నరేంద్రకుమార్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఐక్యుఎసి కో ఆర్డినేటర్ సయ్యద్ అసిమ్, తెలుగు శాఖ అధిపతి డాక్టర్ జి.శ్రీనివాస్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పేరు మార్పు

సింధూర ఆల్తి, D/o. శివరామకృష్ణ ఆల్తి, భీమవరం, పశ్చిమగోదావరి జిల్లా అను నేను యావన్మందికి తెలియజేయునది ఏమనగా,
నా పాస్‌పోర్టు నెం. **J7364955** లో నా ఇంటి పేరు **యిసాయి సింధూర** అని పేర్కొనబడింది. నా భర్త పేరు మురళీమోహనరావు యిసాయి, నా ఇంటి పేరు ఆల్తి, నా ఆధార్ నెం. 959357858582 మరియు నా అన్ని స్టడీ సర్టిఫికెట్లలో నా పేరు **సింధూర ఆల్తి** అని పేర్కొనబడింది. నా పాస్‌పోర్టు మరియు పాఠశాల ధృవపత్రాల మధ్య వ్యత్యాసం ఉంది. ఆధార్ కార్డులో నా ఇంటిపేరును రికార్డ్ చేసి ఉంది. కాబట్టి నా ఇంటి పేరు నా పాస్‌పోర్టులో **ఆల్తి** గా పేర్కొనవలసిందిగా కోరుచున్నాము.

పాస్‌పోర్టు పోయినది

ఏలూరు జిల్లా, పెదవేగి మండలం, పినకడిమి గ్రామం, జంగాలపేట, డి.నెం.2-11 కాపురస్తులు చేజర్ల రాజు, తండ్రి : సుబ్బయ్య, హిందు, పురుష, వయస్సు 45 సం॥లు అను నా యొక్క ఇండి-యన్ పాస్‌పోర్టు జి 7101087 మరియు మరికొన్ని దస్తావేజులు బ్యాగ్‌లో పెట్టుకొని ది.15.02.2023న పినకడిమిలోని మా ఇంటివద్దనుండి ఏలూరు మోటార్ బైక్‌పై వెళ్ళుచుండగా పెదవేగి మండలం దుగ్గిరాల గ్రామంలో పడిపోయినవి. నేను ఎంత వెదికిననూ దొరకలేదు. సదరు పాస్‌పోర్టు జి 7101087 మరియు ఇతర దస్తావేజులు ఎవరికైనా కనిపించినా/ దొరికినా ఈ క్రింది నెంబరుకు ఫోన్ చేసి ఇవ్వగలరు.
Contact : 79813 11905

పాస్‌పోర్టు పోయినది

ఏలూరు జిల్లా, పెదవేగి మండలం, పినకడిమి గ్రామం, జంగాలపేట, డి.నెం.2-11 కాపురస్తులు చేజరాల దుర్గ, భర్త : రాజు, హిందు, స్త్రీ, వయస్సు 39 సం॥లు అను నా యొక్క ఇండియన్ పాస్‌పోర్టు జె 3959481 మరియు మరికొన్ని దస్తావేజులు బ్యాగ్‌లో పెట్టుకొని ది.15.02.2023న పినకడిమిలోని మా ఇంటివద్దనుండి ఏలూరు మోటార్ బైక్‌పై వెళ్ళుచుండగా పెదవేగి మండలం దుగ్గిరాల గ్రామంలో పడిపోయినవి. నేను ఎంత వెదికిననూ దొరకలేదు. సదరు పాస్‌పోర్టు జె 3959481 మరియు ఇతర దస్తావేజులు ఎవరికైనా కనిపించినా/ దొరికినా ఈ క్రింది నెంబరుకు ఫోన్ చేసి ఇవ్వగలరు.
Contact : 79813 11905

In the Court of the VIIth Additional District Judge, Family Court, West Godavari District, Eluru
I.A. No. 1404/2019 in S.O.P. No. 822/2019
Between:
The Executive Committee, Womens College Committee, Tadepalligudem Society, No. 40/1975 and Others ...*Petitioners*
AND
The President, Women's College Committee, Tadepalligudem, Society No. 40 of 1975, Represented by Sri O.P.Goenka and Others ...*Respondents*
1st Respondent/ Respondent:
The President, Womens College Committee, Tadepalligudem Society, No. 40 of 1975 by Sri O.P.Goenka, S/o. Balakrishna, Goenka, Women's College Committee, Tadepalligudem Society, No. 40/1975, D.R.Goenka Women's College, Kadakatla, Tadepalligudem, West Godavari District, TPG SCJC.
పై నెంబరు మెయిన్ మరియు ఇంటీరియమ్ పిటిషనులో పిటిషనరు మరియు పిటీషనర్లు అయిన మేము మీపై పిటిషను దాఖలు చేసిన దర్మిలా 1వ రెస్పాండెంటు మరియు రెస్పాండెంటు అయిన మీకు ఎన్ని పర్యాయములు శ్రీ కోర్టు వారు నోటీసులు పంపించియున్నప్పటికి మీరు తీసుకొనని కారణముగా శ్రీ కోర్టు వారు పేపరు పబ్లికేషను ద్వారా 1వ రెస్పాండెంటు మరియు 1వ రెస్పాండెంటు అయిన మీకు అమలు నిమిత్తం వాయిదా వేసియున్నారు. వాయిదా **తేది 24-2-2023వ సం॥రం తేదీ ఉదయం గం॥ 10.30 ని॥లకు** మీరు స్వయముగా గాని, వకీలు ద్వారా గాని హాజరు అయ్యి ఆక్షేపణలు యున్న యెడల తెలుపుకొనవలెను. లేనియెడల మీకు పరోక్షముగా తీర్మానించబడును.
వాయిదా తేది: 24-2-2023
ముద్దన శ్రీనివాసరావు, న్యాయవాది
తాడేపల్లిగూడెం, సెల్: 9948337320

ఎంఎల్ఏ వాసుబాబు సహాయ, సహకారాలతో

అభివృద్ధి పథంలో పొలసానిపల్లి పంచాయతీ

రెండేళ్ల పదవీకాలం పూర్తయిన సందర్భంగా సర్పంచి షేక్ రహీమా బేగం హసేన

ప్రజాశక్తి - భీమడోలు

సర్పంచి షేక్ రహీమా బేగం హసేన

పొలసానిపల్లి గ్రామాన్ని ఆదర్శ పంచాయతీగా తీర్చిదిద్దేందుకు స్థానిక శాసనసభ్యులు పుప్పాల వాసుబాబు సహాయ సహకారాలతో చర్యలు తీసుకుంటున్నట్లు సర్పంచి షేక్ రహీమా బేగం హసేన తెలిపారు. సర్పంచిగా రెండు సంవత్సరాల కాలం పూర్తయిన నేపథ్యంలో బుధవారం ఆమె ప్రజాశక్తితో మాట్లాడారు. గ్రామంలో ప్రతీ ఇంటికి జలజీవన్ మిషన్‌లో కుళాయి ఏర్పాటు, ఇదే క్రమంలో గోదావరి జలాలు అందించడం, రోడ్లను నూరుశాతం సీసీ రోడ్లుగా మార్చడం, నాణ్యమైన విద్యుత్ ప్రతి ఇంటికీ అందించడం, మురుగునీటి ఇబ్బందులు లేకుండా తరలించేందుకు డ్రెయినేజీ వ్యవస్థను పటిష్టపరచడం వంటి అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. తాజాగా గోదావరి జలాలు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంచేందుకు భీమడోలు సబ్‌స్టేషన్ ఎదురుగా 20 వేల లీటర్ల సామర్థ్యం గల జిఎల్ఎస్ఆర్ నిర్మించామన్నారు. శాసనమండలి ఎన్నికల నిబంధన అనంతరం ప్రారంభోత్సవం చేస్తామని చెప్పారు. గ్రామానికి అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా రైతు భరోసా కేంద్రం, గ్రామ సచివాలయం, హెల్త్ సెంటర్‌తోపాటు విద్యాభివృద్ధిలో భాగంగా సుమారు కోటి రూపాయల వ్యయంతో గ్రామపంచాయతీ పరిధిలోని మూడు ప్రాథమిక పాఠశాలలను అభివృద్ధి చేయడం, అదనపు తరగతి గదులు నిర్మించడం, ఇతర సౌకర్యాల కల్పన వంటివి ముమ్మరంగా సాగుతున్నాయన్నారు. వెంకటరామన్న చెరువును అమృత్ మహోత్సవ్‌లో భాగంగా సుందరంగా అభివృద్ధి చేశామన్నారు. చెరువు చుట్టూ రన్నింగ్ ట్రాక్ ఏర్పాటు, చెరువుగట్టుపై పార్కు, దీనికోసం మొక్కల పెంపకం వంటి కార్యక్రమాలను చేపట్టామన్నారు. గ్రామాన్ని పర్యావరణహిత గ్రామంగా తీర్చిదిద్దే క్రమంలో చెత్త నుండి సంపద తయారీ కేంద్రం పనితీరు మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. ఇదే క్రమంలో చెత్త నుండి సంపద తయారీ కేంద్రాన్ని గ్రామపంచాయతీకి అదనపు ఆదాయ వనరుగా తయారు చేసేందుకు ప్రణాళికలను సిద్ధం చేశామన్నారు.



త్వరలో ప్రారంభించనున్న గోదావరి జలాలను అందించే జిఎల్ఎస్ఆర్ వద్ద సర్పంచి

విద్యుత్ సమస్య పరిష్కారం

గ్రామంలో గతంలో ఓల్టేజీ సమస్య ఉండేదన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని శాసనసభ్యులు, ట్రాన్స్‌కో అధికారుల సహకారంతో గ్రామపరిధిలో గల విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ సామర్థ్యం పెంపు, కొన్నిచోట్ల అదనపు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు, భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని అదనపు ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. ఈ క్రమంలో గ్రామానికి మంజూరైన మూడు జగనన్న కాలనీ లేఅవుట్‌లలో గృహ నిర్మాణాలకు అడ్డంకిగా ఉన్న 33 కెవి లైన్లు మార్పు చేశామన్నారు. ఇళ్ల లే అవుట్‌లలో నిర్మాణాలు తుదిదశకు చేరుకున్నాయని, నిర్మాణాలకు అడ్డంకులు తొలిగాయని వివరించారు.

నీటి సరఫరాకు బోర్ల ఏర్పాటు

పూర్తిగా మెట్ట ప్రాంతమైన పొలసానిపల్లికి తాగునీటి కోసం భూగర్భ జలాలే ఆధారం. ఇప్పటికే అందుబాటులో ఉన్న మూడు ఓవర్ హెడ్ ట్యాంకుల వద్ద బోర్లు ఏర్పాటు చేశామని, తాజాగా ఎర్ర చెరువు వద్ద నూతన బోరు వేశామన్నారు. ఇదేవిధంగా జగనన్న కాలనీలో ఇంటి నిర్మాణాలకు నీటి సరఫరా కోసం మూడు అదనపు బోర్లు వేశామని, ప్రతి నిర్మాణానికి నీరు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నామని వివరించారు. ఇక గ్రామస్తులకు సాగునీరు అందించే ఎర్రచెరువు రెగ్యులేటర్ పున:నిర్మాణ కార్యక్రమం చేపట్టడం ద్వారా వందలాది ఎకరాలకు సాగునీరు అందే అవకాశం ఏర్పడిందన్నారు. పోలవరం కాలువ నుంచి గోదావరి జలాలను గ్రామంలో అధిక విస్తీర్ణం గల చెరువుకు తరలించి, దాన్ని రిజర్వాయర్‌గా మార్చే ఏర్పాటు ప్రతిపాదనలను శాసనసభ్యుల దృష్టికి తీసుకెళ్లనున్నామన్నారు. అక్కడ అదనపు ఓవర్‌హెడ్ ట్యాంక్ నిర్మాణం ద్వారా గోదావరి జలాలను గ్రామంలో అనుసంధానం చేసిన పైపులైన్ల ద్వారా తాగునీటిగా అందించే ప్రయత్నం శాసనసభ్యుల సహకారంతో చేపట్టేందుకు కృషి చేస్తామన్నారు. గ్రామ పరిధిలో పాడైన తాగునీటి పైపు లైన్లను రూ.20 లక్షల వ్యయంతో అభివృద్ధి చేశామన్నారు.

గ్రామ పరిధిలో ఇప్పటికే ఐదు కిలోమీటర్ల పొడవునా సీసీ రోడ్ల నిర్మాణం జరిగిందన్నారు. మరో పది కిలోమీటర్ల పొడవున నిర్మాణం జరిగితే గ్రామంలో అన్ని రహదారులు సీసీ రోడ్లుగా అభివృద్ధి చెందుతాయన్నారు. దీంతోపాటు పక్కా డ్రెయినేజీ వ్యవస్థ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. అంతర్గత రోడ్లలో విద్యుత్ స్తంభాలు లేని కారణంగా విద్యుత్ సరఫరాతో ఇబ్బందులు ఏర్పడుతున్నాయన్నారు. ఈ నేపథ్యంలో రూ.10 లక్షలతో 33 విద్యుత్ స్తంభాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. భీమడోలు జంక్షన్ నుంచే కోళ్ల ఫారం వరకూ ఆర్‌అండ్‌బి రోడ్డు డివైడర్ ప్రాంతంలో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. గ్రామపంచాయతీ పరిధిలోని శ్మశానం వద్ద గతంలో ఏర్పాటు చేసిన పైపులైను పాడైన కారణంగా అంత్యక్రియలు నిర్వహించేందుకు గ్రామస్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఈ సమస్య పరిష్కారానికి బోరు ఏర్పాటుకు కృషి చేస్తామని వివరించారు.

గృహ నిర్మాణాల శంకుస్థాపనలో సర్పంచి (ఫైల్)

అదనపు ఆదాయ వనరు

నిరుపయోగంగా ఉన్న చెరువులను లీజుకు ఇచ్చి పంచాయతీకి అదనపు ఆదాయ వనరులుగా మార్చామన్నారు. గ్రామపంచాయతీ పరిధిలో 44 పెద్ద, చిన్న చెరువులున్నాయని, వీటి ఆక్రమణల తొలగింపునకు నోటీసులు జారీ చేశామన్నారు. ఈ చెరువులను బాగు చేయడం ద్వారా సాగునీరు అందుబాటులో వస్తుందని, భూగర్భ జలాలు పెరుగుతాయని వివరించారు.

అర్హులకు ఇంటి స్థలం

గ్రామానికి కేటాయించిన మూడు జగనన్న లేఅవుట్‌లలో 175 ఇళ్ల నిర్మాణాలు చేపట్టేందుకు అవకాశం ఏర్పడిందన్నారు. ఇప్పటికే ఆ కాలనీలో పనుల ముమ్మరంగా సాగుతున్నాయని చెప్పారు. మరో 250 మందికి ఇళ్ల స్థలాలు అవసరమని గుర్తించామన్నారు. దీనికోసం అవసరమైన భూసేకరణ, స్థలాల పంపిణీకి ఎమ్మెల్యే చర్యలు తీసుకుంటున్నారని వివరించారు. ఇదికూడా పూర్తయితే గ్రామంలోని ప్రతి ఒక్కరికీ సొంతిల్లు ఏర్పడుతుందని తెలిపారు. గ్రామంలోని కమ్యూనిటీ స్థలాలను అభివృద్ధిపరిచి, అక్కడ పార్కులు ఏర్పాటు చేసే ప్రతిపాదన ఉందన్నారు. అమూల్ పాల సేకరణ కేంద్రాన్ని ఏర్పాటు చేసి పాడి రైతులకు అండగా ఉండేందుకు చర్యలు తీసుకుంటామని వివరించారు..

నేరాలు - ఘోరాలు

735 కేజీల గంజాయి పట్టివేత

ప్రజాశక్తి - పెదపాడు

గుట్టుచప్పుడు కాకుండా గంజాయి తరలిస్తున్న అదుపులోకి తీసుకుని అతనివద్ద 735 కేజీల గంజాయిని బుధవారం స్వాధీనం చేసుకున్నామని ఎస్‌పి రాహుల్ దేవ్ శర్మ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పోలీసులకు అందిన సమాచారం మేరకు నూజివీడు డిఎస్‌పి ఇ.ఆశోక్‌కుమార్ గౌడ్ పర్యవేక్షణలో, పెదవేగి సిఐ ఎన్.దుర్గాప్రసాద్, పెదపాడు ఎస్ఐ బి.నాగబాబు, సిబ్బందితో మంగళవారం సాయంత్రం పెదపాడు మండలం కలపర్రు టోల్ ప్లాజా వద్ద వాహన తనిఖీలు చేపట్టారు. గంజాయి తరలిస్తున్న వ్యాన్‌ని గుర్తించి తనిఖీ చేశారు. అందులో గంజాయిని గుర్తించి తమిళనాడుకు చెందిన మురళీ బాలకృష్ణన్‌ను అదుపులోకి తీసుకున్నారు. గంజాయిని స్వాధీనం చేసుకుని వాహనాన్ని సీజ్ చేశారు. ఈ గంజాయి విలువ రూ.74 లక్షల విలువ ఉంటుందని తెలిపారు.

వివాహిత ఆత్మహత్య

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

కుటుంబ కలహాలు, వేధింపుల తాళలేక వివాహిత ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన బుధవారం శ్రీనివాసపురంలో జరిగింది. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. శ్రీనివాసపురానికి చెందిన కంటిపూడి ఇందు(23) అదే గ్రామానికి చెందిన సాయిరామ్‌కు మూడేళ్ల క్రితం వివాహమైంది. వీరికి బాబు ఉన్నాడు. సాయిరామ్ నిత్యం ఇంటికి ఆలస్యంగా రావడం, ఇప్పటికే అతనిపై పలు పోలీసు కేసులు ఉండటంతో తరచూ భార్యభర్తల మధ్య గొడవలు జరిగేవి. మంగళవారం రాత్రి కూడా సాయిరామ్ ఇంటికి ఆలస్యంగా రావడంతో ప్రశ్నించిన ఇందుకు సాయిరామ్‌కు మధ్య గొడవ జరిగింది. విషయం తెలిసిన ఇందు తండ్రి ప్రసాద్ బుధవారం ఉదయం ఇంటికి వెళ్లి వారిద్దరికి సర్దిచెప్పి వెళ్లిపోయాడు. ప్రసాద్ వెళ్లిన కొద్దిసేపటికి సాయిరామ్, కుటుంబ సభ్యులు ఫోన్ చేసి ఇందు ఆత్మహత్య చేసుకుందని చెప్పడంతో హుటాహుటిన వెనక్కి వచ్చారు. సాయిరామ్, అతని కుటుంబ సభ్యుల వేధింపుల కారణంగానే తన కుమార్తె ఇందు మృతి చెందిందని తండ్రి ప్రసాద్ జంగారెడ్డిగూడెం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఎస్ఐ సాగర్‌బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోస్టు మార్టం నిమిత్తం మృతదేహాన్ని స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతురాలి భర్త సాయిరామ్ పరారీలో ఉన్నట్లు సమాచారం

లోపూడిలో భారీ చోరీ

ప్రజాశక్తి - ముసునూరు

లోపూడిలో భారీ చోరీ జరిగింది. 30 కాసుల బంగారం దొంగలు అపహరించుకుపోయారు. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన కోటగిరి శేషగిరిరావు, కుటుంబ సభ్యులు కలిసి ఇటీవల హైదరాబాద్‌లో బంధువుల ఇంటిలో శుభకార్యానికి వెళ్లారు. బుధవారం ఉదయం ఇంటికి వచ్చి చూసేసరికి ఇంటితాళం పగులకొట్టి బీరువాలో ఉన్న బంగారం 30 కాసులు అపహరించుకుపోవడాన్ని గమనించారు. చోరీ జరిగిందని గుర్తించిన శేషగిరిరావు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. నూజివీడు సిఐ అంకబాబు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

జగన్ హయాంలోనే రాష్ట్రం అభివృద్ధి : డిఎన్ఆర్

ప్రజాశక్తి - మండవల్లి

రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడపడం సిఎం జగన్‌కే సాధ్యమని కైకలూరు శాసనసభ్యులు దూలం నాగేశ్వరావు అన్నారు. మండలంలోని మోకాస కలవపూడిలో రూ.30 లక్షలతో నిర్మించనున్న ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం నూతన భవనానికి ఆయన బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధికి జగన్ కృతనిశ్చయంతో ఉన్నారన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడి ప్రజల సంక్షేమం కోసం ఎన్నో పథకాలను ప్రవేశపెట్టి అందించిన ఘనత జగన్‌దేనన్నారు. గ్రామాల్లో పాలన సులభతరం చేసే విధంగా అధికారులందరినీ ఒకే చోట ఉంచి ప్రజాసమస్యలను వేగంగా పరిష్కరించే సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చారన్నారు. ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు తీసుకెళ్తున్నామన్నారు. అనంతరం ఎంఎల్ఎను త్రిసభ్య కమిటీ ఛైర్మన్ గుడివాడ వెంకటసత్యరాజేంద్రవరప్రసాద్ ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు గుమ్మడి వెంకటేశ్వరరావు, బిసి సెల్ రాష్ట్ర నాయకులు చేపల వీర్రాజు, మండవల్లి, భైరవపట్నం పిఎసిఎస్ అధ్యక్షులు బొమ్మనబోయిన గోకర్ణ యాదవ్, ఆచంట వెంకటరత్నం, గుడివాడ తంబిస్వామి, గుడివాడ మురళీకృష్ణ, ముంగరు మల్లికార్జున, మెండ సురేష్, బావిశెట్టి స్వామి, సొసైటీ కార్యదర్శి రాజేష్ పాల్గొన్నారు.

MUNICIPAL CORPORATION, ELURU
e-PROCUREMENT TENDER NOTICE No:
187-189/GGMP-Grant & General Funds/2022-23, Dated: 22-2-2023
The Commissioner, Municipal Corporation, Eluru invites tenders from interested, eligible bidders for **"Construction of Multipurpose Community Hall and Repairs to existing Potholes for CC and BT Roads at various places in Municipal Corporation, Eluru"** Total No. of works is **3** with an amount of Rs. **17.44** Lakhs.
Tender schedules are available on e-procurement market place from 23-02-2023. Last date of receipt of tenders is 27-02-2023. Further details can be seen at e-procurement market place at **www.apeprocurement.gov.in** or contact Commissioner, Municipal Corporation, Eluru, Eluru District (Phone/ Fax: 08812-245990).
Sd/- **COMMISSIONER**
MUNICIPAL CORPORATION, ELURU